క్లుప్తంగా

లేగదూడల ప్రదర్శన



మోగులూరు(కంచికచర్ల) : మండలంలోని మోగులూరు పశువైద్యశాలలో సోమవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గన్నవరం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అందమైన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహించామని తెలిపారు. లేగదూడల ఎదుగుదల కోసం గేదె పాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి నల్లమోతు నరసింహారావు, ద్వితీయ బహుమతి నల్లమోతు అర్జునరావు, తృతీయ బహుమతి నల్లమోతు కృష్ణారావు దూడలు సాధించగా, దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు విజయ్ విశ్వనాథ్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రావు, పశుపోషకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశం



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక 17వ వార్డులోని ఊరచెరువు వద్ద పైపులైన్ నిర్మాణ పనుల కోసం రోడ్డును ధ్వంసం చేసిన కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. ధ్వంసమైన రోడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. రోడ్డును పగులగొట్టినందుకు సంబంధిత కంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ...

పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాల్సిందిగా కార్యదర్శులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్కౌట్, గైడ్ శిబిరాల్లో విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని వ్యాగన్ వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయంలో స్కౌట్, గైడ్ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థులు మానవత్వం, సహనం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం నుంచి మచిలీపట్నం, కాకినాడ నుంచి తెనాలి వరకు 14 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన సుమారు 200 మంది స్కౌట్, గైడ్స్ పాల్గొన్నట్లు తెలిపారు. వీరికి ప్రథమ చికిత్స, ఫైర్ సేఫ్టీ, మంటలేని వంట, కంపాస్, నాటింగ్ అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. క్యాంపు లీడర్ రమేష్‌బాబు, ఎల్‌వోసీ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

ఇరువురికి గాయాలు

తిరువూరు: తిరువూరులోని విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా, ఇరువురు యువకులు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో విజయవాడ నుంచి తిరువూరు వస్తున్న ఆర్టీసీ బస్సు వారిని ఢీకొంది. తిరువూరు మండలం రోలుపడికి చెందిన బర్రె సుధీర్‌కు వీపు భాగంలో తీవ్రగాయం కాగా, విజయవాడకు చెందిన మరొక యువకుడి కాలు ఛిద్రమవడంతో విజయవాడ తరలించారు. బస్సు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సుధీర్ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు



జి.కొండూరు: కుటుంబ కలహాల కారణంగా వివాహిత అదృశ్యం కాగా జి.కొండూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కందులపాడు గ్రామానికి చెందిన వీసం ప్రభుదాసుకు వీరులపాడు మండలం జమ్మవరానికి చెందిన రమణతో 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె. అయితే గత కొంతకాలంగా భార్యా, భర్తలిద్దరూ తరచూ గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రమణ గత శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. రమణ ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో రమణ భర్త ప్రభుదాసు సోమవారం జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు.

ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



గౌరవరంలో మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు



కంచికచర్లలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంత ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని భూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. గౌరవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వివరించారు. వైద్య పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్తినేని పావని, వైద్యులు స్రవంతి, కీర్తి రెడ్డి, ఈవోపీఆర్డీ సాంబశివరావు, కార్యదర్శులు జగ్గయ్య, మంగమ్మ, గ్రామ సచివాలయ కన్వీనర్‌లు, అంగనవాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : పేదలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని సర్పంచి వేల్పుల సునీత పేర్కొన్నారు. కంచికచర్ల గ్రామసచివాలయం-3 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సర్పంచి సునీత మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయడం వైద్యరంగ చరిత్రలోనే గొప్పపరిణామమని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.బాలశంకరరావు, ఎంఈవో బి.బాలాజీ, సీడీపీవో వి.భాగ్యరేణుక, పీహెచ్‌సీ వైద్యురాలు కె.మధురిమ, ఎంపీటీసీ సభ్యులు బర్రె ఉదయ్‌కిరణ్, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, గ్రామ సచివాయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

లింగగూడెం(పెనుగంచిప్రోలు): రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ బరిగెల మంగమ్మ, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామయ్య తెలిపారు. మండలంలోని లింగగూడెం సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సృజన, డాక్టర్ పి.ఇందిర పాల్గొని 413 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మంగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బి.వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఏనుగుల ధర్మారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కృష్ణబాబు, వైద్యశాఖ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

కన్నెవీడు(వత్సవాయి) :పేద ప్రజలకు గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని కన్నెవీడు సర్పంచ్ చావా దుర్గారాణి పేర్కొన్నారు. మండలంలోని కన్నెవీడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఆరోగ్యంగా ఉండాలని వారి వద్దకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. అన్ని రకాల పరీక్షలను నిర్వహించి వారికి కావలసిన మందులను ఉచితంగా అందిస్తుండటం సంతోషదాయకమన్నారు. గ్రామాల్లో జరిగే ఈ క్యాంపులను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, చావా శ్రీధర్, కేఆర్ భరద్వాజ్, హెచ్ఎం అజ్మీరు కొండ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

నరసింహారావుపాలెం(వీరులపాడు): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెంలో సోమ వారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైద్యాధికారి దీపిక, ఎంపీపీ లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ అన్ని విభాగాల స్పెషలిస్ట్ వైద్యులతో గ్రామంలోనే వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ప్రజలకు ఎంతో మేలు చేకూర్చుతోందని వివరించారు. ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పచ్చాల కోటేశ్వరరావు, నాయకులు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లింగగూడెంలో కిట్లు అందజేస్తున్న సర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామయ్య, వైద్యులు



కన్నెవీడు శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ దుర్గారాణి, నాయకులు



నరసింహారావుపాలెం శిబిరంలో పాల్గొన్న నాయకులు, వైద్యసిబ్బంది

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో మంగళవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొంటారని వివరించారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద బోసు పేట నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

మైలవరం: విద్యార్థులకు చదువుతోపాటు ఇతర రంగాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సూచించారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో భౌతిక శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అంతరిక్ష పరిశోధనలకు భౌతికశాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు భౌతిక శాస్త్రంపై అవగాహన పెంచుకుని సమాజానికి ఉపయోగపడాలన్నారు. ప్రదర్శనలో విద్యార్థులు విశ్వ రహస్యాలను కళ్లకు కట్టినట్లు పవర్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. సుమారు 20 ప్రదర్శనలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు, డాక్టర్ జే రాముడు వ్యవహరించారు. ప్రథమ బహుమతి ప్రియాశ్రీవల్లి, ద్వితీయ బహుమతి సమీర, లీల, తృతీయ బహుమతి వెన్నెల గెలుచుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ రవి అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని భౌతికశాస్త్ర విభాగాధిపతి వి.ఉమాలక్ష్మి పర్యవేక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్డీవో 'స్పందన'కు 13 అర్జీలు



అర్జీదారుడితో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 13మంది అర్జీలు అందజేసినట్లు ఆర్డీవో ఎ.రవీంద్రరావు తెలిపారు. తమ గ్రామానికి బస్సు సదుపాయం కల్పించాలంటూ చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామానికి చెందిన ఇసిరెడ్డి బ్రహ్మారెడ్డి అర్జీని అందజేశారు. ఆర్టీసీ బస్సులు చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామం మీదుగా రామన్నపేట వెళ్తాయని, ఈ క్రమంలో కాండ్రపాడు మీదుగా బస్సులను తిప్పితే మూడు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయని బ్రహ్మారెడ్డి విన్నవించారు. అనంతరం ఆర్డీవో స్పందిస్తూ ఆర్టీసీ అధికారులు మాట్లాడి బస్సు సదుపాయం కల్పిస్తామని హామీఇచ్చారు.

విత్తన తయారీపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏడీఏ

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): రైతులు విత్తన ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఆర్సీ ఏడీఏ మొనీష సూచించారు.వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమంపై తక్కెళ్లపాడులో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమకు అవసరమైన విత్తనాన్ని తామే ఉత్పత్తి చేసుకోవచ్చని సూచించారు. విత్తనం తయారు చేసుకునేందుకు పంట విత్తనం దగ్గర నుంచి కోత నిల్వ వరకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రస్తుతం వరి పంటలో విత్తనం తయారు చేసేటప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కంకిదశలో ఉన్నందున కేళీలను గమనించి తీసేయాలని తెలిపారు. వరి రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. అనంతరం వరి పంటలు పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మీ, వీఏఏ భరత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న నందిగామ మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రెయిన్లలో పూడిక తీత, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు, అవసరమైన చోట్ల బ్లీచింగ్ చల్లించడం, కంప చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించడం, దోమల నిర్మూలనకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• ప్రజాప్రతినిధుల సభలో..



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల సభ సోమవారం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరయ్యారు. -సాక్షి విజయవాడ

ప్రజల భాగస్వామ్యంతో అద్భుత విజయాలు



మాట్లాడుతున్న పెనుగంచిప్రోలు ఎంపీడీవో ప్రసాద్, వేదికపై తహశీల్దార్ లక్ష్మీకల్యాణి, సర్పంచులు



అంగన్‌వాడీ స్టాల్ వద్ద సీడీపీవో లక్ష్మీభార్గవి, కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: ప్రజల భాగస్వామ్యం ద్వారానే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాల సాధన సాధ్యమని ఎంపీడీవో ఎస్‌వీ ప్రసాద్, తహశీల్దార్ కె.లక్ష్మీకళ్యాణి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి నీతి అయోగ్ మండలాన్ని ఆస్పిరేషనల్ బ్లాక్‌గా గుర్తించిన నేపథ్యంలో స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో వారంరోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. వారోత్సవాల ముగింపు సందర్భంగా సంకల్ప్ సప్తాహ్ సమావేశ్ సమ్మేళన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో, తహశీల్దార్ మాట్లాడుతూ కేంద్రం నిర్దేశించిన 39 అంశాలకు సంబంధించి ప్రజల భాగస్వామ్యంతో అన్ని శాఖల అధికారులు పనిచేసి ఆయా అంశాల్లో మండలాన్ని ముందంజలో ఉంచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఆయా అంశాలపై ఇప్పటికే అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు భాగస్వామ్యంతో పనిచేస్తే చక్కటి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రజల జీవనోపాధులు పెంచేందుకు అందరూ కలిసి పనిచేస్తే కేంద్ర ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్, ప్రకృతి వ్యవసాయం, ఐకేపీ, ఉద్యానవనం, జల జీవన్ మిషన్, విద్యాశాఖ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎంఈవో డి.రవీంద్ర, సీడీపీవో లక్ష్మీ భార్గవి, ఏపీఎం రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సర్పంచ్‌లు గోనెల దేవి, నక్కా కమల, జక్కులూరి రాంబాబు, సైదులు, ఎంపీటీసీ సభ్యులు జంగం వీరమ్మ, మాతంగి శాంత కుమారి, ఏవో సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం జగ్గయ్యపేటలోని 12, 13, 14వ సచివాలయాల పరిధిలోగల జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని వివరించారు. స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొనే ఈ వైద్యశిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుమ్మడిదూర్రులో ...

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): మండలంలోని గుమ్మడిదూర్రులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో అన్నా రు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిగామ మున్సిపాలిటీ పరిధిలో...

నందిగామ: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం తెలిపారు. పట్టణ పరిధిలోని 5, 6, 7 సచివాలయాలకు సంబంధించి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్దనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

పూరిల్లు దగ్ధం

చంద్రాల(మైలవరం): చంద్రాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. చంద్రాల గ్రామంలో గుణదల రామకృష్ణకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెలరేగి దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు దంత సంరక్షణ చర్యలు పాటించాలని దంత వైద్యనిపుణుడు ఈదర విశ్వాస్ అన్నారు. మెరీడియన్ పాఠశాలలో విద్యార్థులకు మాసాంతపు దంత పరీక్షల శిబిరం నిర్వహించారు. డాక్టర్ కందిమళ్ల నైమిషతో కలిసి విద్యార్థులకు దంత పరీక్షలు చేసి టూత్ పేస్టులు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.